శివ పంచాక్షరీ స్తోత్రమ్ - భావార్థముతో.



సేకరణ: కిరణ్ టైప్ ఇనిస్టిట్యూట్, 41-1/8-13A.,
గౌతమీనగర్,3వ లైను, కృష్ణలంక, విజయవాడ-520 013.
https://madhirafamily.wordpress.com/

శ్రీ శంకరాచార్య విరచిత

శివ పంచాక్షర స్తోత్రమ్ - భావార్థముతో.

ఈ మంత్రం కృష్ణ యజుర్వేదంలో భాగమైన శ్రీ రుద్రం శ్లోకంలో ఉంది. ఈ మంత్రం శుక్ల యజుర్వేదంలోని ఒక భాగమైన రుద్రష్టాధ్యంలో కూడా కనిపిస్తుంది.

ఈ స్తోత్రం రాసిన వారు జగద్గురు ఆది శంకరాచార్యులు.

- - - ॥ - - -

నమఃశివాయ - శివుని పంచ బోధా తత్వంగా పరిగణించబడుతుంది. మరియు అతని ఐదు అంశాల సార్వత్రిక ఏకత్వం.

- పంచ భూతాలు - భూమి (న) నీరు (మ), అగ్ని (శి), గాలి (వా), ఆకాశం (య).
- పంచ తన్మాత్రాలు - వినికిడి, స్పర్శ, దృష్టి, రుచి మరియు వాసన.
- పంచ కర్మేంద్రియాలు - వాక్కు, పాణి, పాదం, పాయువు, మరియు ఉపస్థ.
- పంచ జ్ఞానేంద్రియాలు - చర్మం, కన్ను, నాలుక, చెవి మరియు ముక్కు.
- పంచ ప్రాణాలు - ప్రాణము, అపానము, సమానము, ఉదానము, వ్యానము
- శబ్దాలకు మూలమైనది "ఓం" కారము. ఈ " ఓం " కారము ఐదు భాగములతో ఉన్నది. --- 'అ' కార, 'ఉ' కార, 'మ' కార, "బిందు" మరియు "నాద"
- పరమేశ్వరుని కృత్యములు - సృష్టి, స్థితి, సంహార, తిరోధాన మరియు అనుగ్రహ.

దీని మొత్తం అర్థం "విశ్వ చైతన్యం ఒక్కటే"

ఈ ఐదింటితోనే ప్రపంచమంతా నిండి ఉండి. ఏ ప్రపంచం?

మన ప్రపంచం, మన చుట్టూ ఉన్న ప్రపంచం. మరి ఈ ఐదు ఎవరి వల్ల పని చేస్తున్నాయి?

వాటి నిండా పరమేశ్వరుని చైతన్యం వ్యాపించి వుంది. అనగా పరమేశ్వరుడు ఈ ఐదింటి ద్వారా ప్రపంచాన్ని శాసిస్తున్నాడు. అంటే ఈ ఐదు పరమేశ్వరుని ఆధీనంలో ఉన్నాయి. అయనే ఈ ఐదింటి నుంచి శక్తి ప్రసరింపచేస్తున్నాడు.

- - "పంచ" గా చెప్పబడుచున్న ఈ ప్రపంచమంతా విస్తరించిన ఆ పరమేశ్వరుని అనుగ్రహము పొందటానికి పనికొచ్చే మంత్రమే " పంచాక్షరి " - - -

- - - ॥ - - -

01. నాగేంద్ర హారాయ త్రిలోచనాయ
భస్మాంగ రాగాయ మహేశ్వరాయ।
నిత్యాయ శుద్ధాయ దిగంబరాయ
తస్మై "న" కారాయ నమశ్శివాయ (నమః శివాయ)॥

నాగేంద్రుని హారముగా ధరించిన వాడు, మూడు కన్నులవాడు, భస్మము ఒంటినిండా పూసుకున్న వాడు, మహేశ్వరుడు, నిత్యమైనవాడు, పరిశుద్ధుడు, దిగంబరుడు, "నమశ్శివాయ" అను మంత్రము నందలి "న" అను అక్షరమైనవాడు అగు శివునకు నమస్కారము.

సర్పరాజైన వాసుకిని కంఠాభరణముగా ధరించి త్రినేత్రములు కలిగినవాడై, పరమ పవిత్రమైన విభూతిని శరీరము లోని అన్ని భాగములపై అలముకున్న మహేశ్వరుడై, శాశ్వతుడు, శుద్ధ స్వరూపుడు, దిక్కులే అంబరముగా అనగా వస్త్రముగా కలిగిన దిగంబరుడు, "న" కార రూపమై వెలుగుతున్న ఈశ్వరునికి నమస్కారము.

సర్పముల రాజైన నాగేంద్రుని మాలగా ధరించినవాడు, మూడు కళ్ళు కలిగినవాడు. బూడిదను ఒంటి నిండా పూసుకున్నవాడు, గొప్ప ప్రభువు. శాశ్వతమైనవాడు, పరిశుభ్రమైన / స్వచ్ఛమైనవాడు, దిక్కులనే వస్త్రములుగా ధరించినవాడు, పంచాక్షరీ మంత్రం యొక్క మొదటి అక్షరం "న" అనే అక్షరంతో సూచించబడిన ఆ శివుడికి నమస్కారాలు.

02. మందాకినీ సలిల చందన చర్చితాయ
నందీశ్వర ప్రమథనాథ మహేశ్వరాయ।
మందార (పుష్ప)ముఖ్య బహు పుష్ప సుపూజితాయ
తస్మై "మ" కారాయ నమశ్శివాయ (నమః శివాయ)॥

ఆకాశగంగా జలమనే చందనము పూయబడినవాడు, నందీశ్వరుడు మొదలైన ప్రమథ గణములకు నాయకుడు, మందారము మొదలైన అనేక పుష్పములచే పూజింప బడినవాడు, "నమశ్శివాయ" అను మంత్రము నందలి "మ" అను అక్షరమైనవాడు అగు శివునకు నమస్కారము.

పవిత్రమైన మందాకినీ నదీ జలములచేత, సువాసనాభరితమైన గంధపు మైపూతల చేత అర్చించబడేవాడు, నందీశ్వరుడు, ఇతర ప్రమథ గణములకు నాయకుడు, మందారము వంటి అనేక పుష్పములచేత అర్చించబడువాడు, 'మ' కార రూపమై వెలుగుతున్న ఈశ్వరునికి నమస్కారము.

పవిత్రమైన గంగా జలముతో కలపబడిన గంధమును పూయబడినవాడు, నందీశ్వరాది ప్రమథ గణములకు నాయకుడైనవాడు, గొప్ప ప్రభువు, మందార మరియు అనేక రకాల పువ్వులతో పూజింపబడేవాడు, పంచాక్షరీ మంత్రం యొక్క రెండవ అక్షరం "మ" అనే అక్షరంతో సూచించబడిన ఆ శివుడికి నమస్కారాలు.

03. శివాయ గౌరీ వదనాబ్జ (వృ)బృంద (వదనారవింద)
సూర్యాయ దక్షాధ్వర నాశకాయ।
శ్రీ నీలకంఠాయ వృష(భ)ధ్వజాయ
తస్మై "శి" కారాయ నమశ్శివాయ (నమః శివాయ)॥

మంగళకరుడు, పార్వతీ ముఖమనే పద్మసముదాయమును వికసింప చేయు సూర్యుడు, దక్షుని యాగము నాశనం చేసినవాడు, నల్లని కంఠము కలవాడు, జండాపై ఎద్దు చిహ్న మున్నవాడు "నమశ్శివాయ" అను మంత్రము నందలి "శి" అను అక్షరమైనవాడు అగు శివునకు నమస్కారము.

మంగళకరుడు, పద్మము వంటి గౌరీదేవి ముఖారవిందమును వికసింపచేయుటకు అప్పుడే ఉదయించుచున్న సూర్యుని కాంతి కలవాడు, దక్షుని యజ్ఞమును ధ్వంసము చేసినవాడు, గరళమును స్వీకరించుటచే నీలకంఠుడైనవాడు,

వృషభమును తన ధ్వజముపై గుర్తుగా కలిగినవాడు, "శి" కార రూపమై వెలుగుతున్న ఈశ్వరునికి నమస్కారము.

పరమశివుడు, గౌరీదేవి యొక్క పద్మము వంటి ముఖమును వికసింపచేసే సూర్యుని వంటివాడు, దక్షుని యజ్ఞమును నశింప చేసినవాడు, నీలం రంగు గొంతు కలిగినవాడు, జండా పై నంది చిహ్నమున్నవాడు, పంచాక్షరీ మంత్రం యొక్క మూడవ అక్షరం "శి" అనే అక్షరంతో సూచించబడిన ఆ శివుడికి నమస్కారాలు.

04. వశిష్ఠ కుంభోద్భవ గౌతమార్య(గౌతమాది)
మునీంద్ర దేవార్చిత శేఖరాయ।
చంద్రార్క వైశ్వానర లోచనాయ
తస్మై "వ" కారాయ నమశ్శివాయ (నమః శివాయ)॥

వసిష్ఠుడు, అగస్త్యుడు, గౌతముడు, మొదలైన మునీంద్రుల చేత పూజింపబడు జటాజూటము కలవాడు, చంద్రుడు-సూర్యుడు-అగ్ని మూడు కన్నులుగా కలవాడు, "నమశ్శివాయ" అను మంత్రము నందలి "వ" అను అక్షరమైనవాడు అగు శివునకు నమస్కారము.

వసిష్ఠుడు, అగస్త్యుడు, గౌతముడు మొదలైన మునీంద్రులచేత, సకల దేవతలచేత అర్చింపబడేవాడు, ఈ సమస్త విశ్వమునకు మకుటమై విరాజిల్లువాడు, సూర్య, చంద్ర, అగ్నులను మూడు నేత్రములుగా కలిగినవాడు, "వ" కార రూపమై వెలుగుతున్న ఈశ్వరునికి నమస్కారము.

వశిష్టుడు, అగస్త్యుడు మరియు గౌతముడు వంటి గొప్ప ఋషుల చేతను మరియు దేవతల చేతను ఆరాధించ బడేవాడు, చంద్రుడు, సూర్యుడు మరియు అగ్నిని తన మూడు కళ్ళుగా కలిగి ఉన్నవాడు, పంచాక్షరీ మంత్రం యొక్క నాల్గవ అక్షరం "వ" అనే అక్షరంతో సూచించబడిన ఆ శివుడికి నమస్కారాలు.

05. యక్ష(యజ్ఞ) స్వరూపాయ జటాధరాయ
పినాక హస్తాయ సనాతనాయ।
దివ్యాయ దేవాయ దిగంబరాయ
తస్మై "య" కారాయ నమశ్శివాయ (నమః శివాయ)॥

యక్షస్వరూపుడు, జటలను ధరించిన వాడు, 'పినాకము' అను ధనుస్సును చేతిలో పట్టుకున్నవాడు, సనాతనుడు, ఆకాశమునందుండు దేవుడు, దిగంబరుడు, "నమశ్శివాయ" అను మంత్రము నందలి "య" అను అక్షరమైనవాడు అగు శివునకు నమస్కారము.

తానే యజ్ఞస్వరూపమైనవాడు, జటాధారి, పినాకమును హస్తమున ధరించినవాడు, నిత్యుడు, పవిత్రుడు, ప్రకాశవంతుడు, నాలుగు దిక్కులు వస్త్రములుగా ధరించినవాడు, "య" కార రూపమై వెలుగుతున్న ఈశ్వరునికి నమస్కారము.

యక్షుడి స్వరూపంతో ఉన్నవాడు, జడ పాయలను ముడిగా చుట్టుకొన్నవాడు, చేతిలో "పినాకము" అనే ధనస్సును కలిగినవాడు, శాశ్వతమైనవాడు, ప్రకాశించేవాడు, దైవికమైనవాడు, దిశలను తన వస్త్రములుగా ధరించినవాడు, పంచాక్షరీ మంత్రం యొక్క ఐదవ అక్షరం "య" అనే అక్షరంతో సూచించబడిన ఆ శివుడికి నమస్కారాలు.

06. పంచాక్షరమిదం పుణ్యం య(ః) పఠే(చ్ఛి)చ్ఛివసన్నిధౌ।
శివలోకమవాప్నోతి శివేన సహ మోదతే॥

పావనమైన ఈ పంచాక్షర స్తోత్రమును ఎవరు శివసాన్నిధ్యంలో స్తుతిస్తారో, వారికి శివలోకప్రాప్తి కలిగి, శివుని అనుగ్రహమును పొందుదురు.


ఎవరైతే ఈ పంచాక్షర స్తోత్రమును భక్తి శ్రద్ధలతో అనునిత్యం పఠిస్తారో, వారు ఈశ్వర అనుగ్రహమునకు పాత్రులై, ఈశ్వరుని సన్నిధిలో శాంతిని పొందుతారు.

ఎవరైతే పుణ్యప్రదమైన ఈ పంచాక్షర స్తోత్రమును శివసన్నిధిలో చదువుతారో, వారు శివుని నివాసమైన కైలాసం పొందుతారు మరియు అనుగ్రహము పొందుతారు.

– – – = – – –

(బాహ్య పూజ కంటే మానసిక పూజ (ఆరాధన) చాలా శక్తివంతమైనది.)

// ఇతి శ్రీ శివ పంచాక్షరీ స్తోత్రమ్ సంపూర్ణమ్ //



కిరణ్ టైప్ ఇన్స్టిట్యూట్



(ఎక్కడైనా తప్పులు ఉంటే సహృదయంతో తెలియజేయవలసినదిగా మనవి.-944 044 9650, 994 994 1430)